ఘట్‌కేసర్‌లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'



ఘట్‌కేసర్‌లో ర్యాలీలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఘట్‌కేసర్: అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీసీ సూపర్‌వైజర్ చంద్రకళ, టీచర్ సునీత ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లోని తొమ్మిదో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రభుత్వం విద్యార్థులతో కల్పిస్తున్న సౌకర్యాలను ప్లకార్డులు చేతబట్టి అవగాహన కల్పించారు.

రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన

శామీర్‌పేట్: రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభిస్తుందని తహసీల్దార్ యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయంజాల్‌లో తహసీల్దార్ యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 46 అర్జీలు వచ్చాయి. అదే విధంగా డిప్యూటీ తహసీల్దార్ సంయుక్తాధ్వర్యంలో సింగాయిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలు వచ్చాయి. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 166 అర్జీలు వచ్చాయి. శుక్రవారం తూంకుంట మున్సిపాలిటీ, దేవరయంజాల్‌లో చివరి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనూష, ఆర్‌ఐలు రాఘవసాగర్, అన్వేష్, కవిత, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో వనమహోత్సవం



డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ అధికారులు

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో ఆర్టీసీకి చెందిన రీజియన్, డివిజన్, డిపో అధికారులు గురువారం మొక్కలు నాటారు. డిపో ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా అధికారులు మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు నీరు పోశారు. డిపో పనితీరుపై అధికారులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుచరిత, డీవీఎం అపర్ణ కల్యాణి, డీఎం సుధాకర్ పాల్గొన్నారు.

దేవాదాయ భూముల జోలికొస్తే కఠిన చర్యలు



వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి కొండా సురేఖ

బోడుప్పల్: దేవాదాయ భూములను కబ్జా చేసి లేఅవుట్‌లు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. చెంగిచర్లలోని సర్వే నంబరు 33/8, 33/9, 33/10లో 30 ఎకరాల ఎండోమెంట్ భూమి కబ్జా అయిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఫిర్యాదు చేయగా, మంత్రి గురువారం ఆకస్మాత్తుగా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కబ్జా గురైన భూముల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెంగిచర్లలోని సర్వే నంబరు 33/8లో 10.35 ఎకరాలు, 33/9లో 13 ఎకరాలు, 33/10లో 6.23 ఎకరాల ఎండోమెంట్ భూమి ఉందన్నారు. సదరు భూమి పక్కన ఉన్న భూ యజమానులు నోమా యాదగిరి రెడ్డి, హర్ష అనే వ్యక్తులు ఈ దేవాదాయ భూమిని ఆక్రమించుకుని విల్లాలు కడుతున్నారని వజ్రేష్ యాదవ్ అధికారులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఆ భూముల్లో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నేత కొత్త ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కీసరలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కీసరదాయరలో..



కీసరదాయర-భోగారం రహదారిలో..

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యుత్ స్తంభాలు, కిందికి వాలిన విద్యుత్ లేన్లు, ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇటు వ్యవసాయ క్షేత్రాలతో పాటు, ఆయా గ్రామాల, కాలనీల మధ్య పరిస్థితులు ఇలాగే నెలకొన్నాయి. అసలే వర్షాకాలం అందులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిని నెలకొందని రైతులు వాపోతున్నారు.

రైతులకు తప్పని ఇబ్బందులు..

కీసర, కీసరదాయర, వన్నిగూడ, రాంపల్లి దాయర, కరీంగూడ, గోధుమకుంట, తదితర గ్రామాల్లోగల వ్యవసాయ క్షేత్రాల వద్ద బోరు బావులకు విద్యుత్ సరఫరా అందించే విద్యుత్ స్తంభాలు చాలా చోట్ల ఓ వైపు వంగిపోయాయి. విద్యుత్ లైన్ల వైర్లు కిందికి వేలాడుతుండటంతో వ్యవసాయ పనులు చేసే సమయంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాక్టర్లతో దుక్కులు దున్నే సమయాల్లో కింది వాలిన విద్యుత్ లైన్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల మృత్యువాత..

గతంలో వర్షాకాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుదాఘాతానికి గురై పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయి. ఇక రెండు మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల్లో కూడా ఏళ్ల క్రితం నాటి విద్యుత్ స్తంభాల్లో కొన్ని ప్రమాదకరంగా తయారయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ కాలనీ మధ్యలో ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటిని తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి..

విద్యుత్ అధికారులు స్పందించి వ్యవసాయ క్షేత్రాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌లైన్లతోపాటు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెట్ల పొదలను తొలగించి, కిందికి వాలిన విద్యుత్ లైన్లను సరిచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలి..



వివిధ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. లో ఓల్టేజీ సమస్య తీర్చేందుకు అవసరమైన చోట కొత్త విద్యుత్ లైన్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.

– కౌకుట్ల చంద్రారెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్

బాలకార్మికులు లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి



జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ, విద్యార్థులు

జవహర్‌నగర్: బాలకార్మికులు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా జడ్జి కిరణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. చదువుతోనే బాల్యం బంగారుమయం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అజామోహినుద్దీన్, బాల రక్షక్ కో ఆర్డినేటర్ తిరుమలదేవి, అరుణ్, సతీష్, శరవణ్, హరి భూషన్, క్రాంతి, రమేష్, స్వప్న, సరిత పాల్గొన్నారు.

ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలి



కోర్టు ఆదేశాలను కమిషనర్ వీరారెడ్డికి అందజేస్తున్న బార్ కౌన్సిల్ సభ్యుడు భరద్వాజ్

పోచారం: ఇన్ఫోసిస్ పోచారం క్యాంపస్ వద్ద నిర్మించిన హాస్టల్స్ నుంచి వచ్చే మురుగు సమీపంలోని చెరువులోకి చేరుతోందని జనవరి 29న మున్సిపల్ కమిషనర్‌ను కోరుతూ బార్ కౌన్సిల్ సభ్యుడు చెరుకు భరద్వాజ్ గౌడ్ ఫిర్యాదు చేశారు. చెరువులోకి మురుగు చేరడంతో జలవనరులు కలుషితమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చి ఐదు నెలలైనా కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భరద్వాజ్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్పందించి నాలుగు వారాల్లోగా భరద్వాజ్ ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కమిషనర్‌ను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా కోర్టు జారీ చేసిన ఆదేశాలను గురువారం భరద్వాజ్‌తో పాటు పోచారం ప్రాంతానికి చెందిన కొందరు యువకులు కమిషనర్ వీరారెడ్డిని కలిసి అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులు

మేడ్చల్: పేదల సొంతింటి కలనేరవేర్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకం చేపట్టారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని గౌడవెల్లిలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్ల ఆశ చూపి వారిని మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం పేదల పక్షపాతని పేదల స్వప్నం నేరవేర్చడానికి అర్హులు ఎంతమంది ఉంటే అందరికి ఇళ్లు మంజూరీ చేసి నిర్మాణం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, రవి, భగవాన్ దాస్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



అత్వెల్లి సదస్సులో రైతు ఫిర్యాదును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయెందర్ రెడ్డి అన్నారు. గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ శ్రీరంగవరంలో నిర్వహించిన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. భూ భారతిలో వచ్చిన సమస్యల వల్ల సత్వరమే పరిష్కారం లభిస్తుస్తుందని, రెవెన్యూ రికార్డుల నిర్వహణ సరిగా ఉంటుందన్నారు. రైతుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి కోడ్‌లు కేటాయించాలని సూచించారు. అర్జీల పరిష్కారం కోసం అధికారులు అవసరమైతే క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. రైతులతో మాట్లాడి, వారు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్: ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించడానికి నేడు మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను, సలహాలను, సూచనలను డీఎంకు తెలియజేయడం వల్ల వెంటనే పరిష్కరించే వీలు ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ సలహాలను, సూచనలను, సమస్యలను నేడు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల లోపు 99592 26152కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

భవిష్యత్ తరాలకు మోదీ ఆదర్శప్రాయుడు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామారావు

మేడ్చల్‌రూరల్: ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్లుగా అవినీతి రహిత, స్వచ్ఛమైన పాలన అందించి దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథాన తీసుకెళ్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయంగా నిలిచారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లోని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రోజుకొక కుంభకోణం వెలుగుచూసేదని, ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలో కేంద్రమంత్రులు సైతం అవినీతి కేసుల్లో జైలు పాలయ్యారని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, మహిళా బిల్లు వంటి ఎన్నో సాహసోపేత నిర్ణయాలు బీజేపీ ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేదలు, ధనికు మధ్య అగాథం పెరుగుతూ వచ్చిందన్నారు. 2014కు ముందు ప్రపంచంలో 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు నాలుగవ స్థానానికి ఎదిగిందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, రాష్ట్ర నాయకులు మురళీందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, నాయకులు సుదర్శన్‌రెడ్డి, విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు క్రీడా పోటీలు

శామీర్‌పేట్: స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు ఈ నెల 18న మూడుచింతలపల్లి మున్సిపల్‌లో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మూడు చింతలపల్లి ఎంఈఓ భాగ్యమణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి ప్రవేశానికి మూడుచింతలపల్లిలోని క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహిస్తున్నామని, స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య కాలంలో జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బోనోఫైడ్, మూడో తరగతి ప్రోగ్రెస్ కార్డు, ఐదు పాస్ ఫొటోలతో పోటీలకు హాజరు కావాలని వివరించారు. పూర్తి వివరాలకు 9174165 42457, 9180196 07642లలో సంప్రదించవచ్చు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హరిజన బస్తీ, కుమ్మర్ బస్తీలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మచ్చబొల్లారం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, దేవేందర్, కొండల్‌రెడ్డి, విష్ణు, వీవీఆర్. వెంకటేష్‌గౌడ్, రాము, సెల్వరాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అత్తను హత్య చేసిన అల్లుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఎన్‌స్పెక్టర్ పరశురాం, చిత్రంలో నిందితుడు దొరబాబు

ఘట్‌కేసర్: విక్రయించిన సెల్‌ఫోన్‌ను తిరిగి తీసుకు రావాలని అల్లుడిని నిలదీసిన అత్తపై కక్ష పెంచుకొని ఊపిరి అందకుండా చేసి చంపిన అల్లుడిని ఘట్‌కేసర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పరశురాం గురువారం వివరాలు తెలియజేశారు. హత్యకు గురైన ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మైసమ్మగుట్టకు చెందిన మంజుల బుజమ్మ రెండో అల్లుడు శేరిలింగంపల్లి గోపంపల్లికి చెందిన శాతోల దొరబాబు(30) భార్య గీతతో కలిసి జీవనోపాధి కోసం ఘట్‌కేసర్‌కు వలసి వచ్చి అత్త ఇంటి సమీపంలో నివాసం ఉంటున్నాడు. కాగా ఈ నెల 6న మృతురాలు బుజ్జమ్మ సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. విక్రయించగా వచ్చిన డబ్బుతో మద్యం సేవించాడు. ఎత్తుకెళ్లిన ఫోన్‌ను తిరిగి తీసుకు రావాలని అల్లుడిపై పదేపదే అత్త ఒత్తిడి చేసింది. వేధింపులు భరించలేక అత్తపై అల్లుడు కక్ష పెంచుకున్నాడు. అత్తను చంపితే పీడ విరగడవుతుందని భావించిన దొరబాబు అదను కోసం ఎదురుచూస్తున్నాడు. కాగా దొరబాబు భార్య బుజ్జమ్మ రెండో కూతురు గీత, చిన్న కూతురు గౌరీతో కలిసి మంగళవారం జనగామ చర్చికి వెళ్లి అక్కడే ఉండిపోయారు. కక్షతో రగిలిపోతున్న అల్లుడు గుడిసెలో అత్త ఒంటరిగా నిద్రపోవడం గుర్తించాడు. బుధవారం ఉదయం 4 గంటల ప్రాంతంలో గుడిసెలోకి వెళ్లి దిండుతో ఊపిరి అందకుండా చేశాడు. ఆపై గొంతు నులిమి చంపేశాడు. ఉదయం కూతుళ్లు ఇంటికి వచ్చే సరికి తల్లి బుజ్జమ్మ విగతజీవిగా పడి ఉంది. మెడపై గాట్లు గాయాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు వివరాలు సేకరించారు. చిన్న కూతురు గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానంతో నిందితుడు దొరబాబును యంనంపేట్ చౌరస్తాలో అదుపులోకి తీసుకొని విచారించగా అత్తను తానే చంపినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతడిని గురువారం రిమాండ్‌కు తరలించారు.

మోగిన బడి గంట

- బడిబాట పట్టిన విద్యార్థులు
- పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం పంపిణీ



పూడూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



నూతన్‌కల్‌లో పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: వేసవి సెలవులు ముగిశాయి..పాఠశాలలు పునర్ ప్రారంభం అయ్యాయి. నిన్నటి వరకు ఆడిపాడిన విద్యార్థులు గురువారం ఉదయం భుజాన బ్యాగులతో బడిబాట పట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మొదటి రోజు స్కూళ్లకు రెడీ చేసి పంపగా కొందరు ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లగా మరికొందరు చిన్నారులు ఏడుస్తూ బడికి చేరారు.

పాఠశాలల ప్రారంభం రోజునే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టగా ఈ మేరకు గురువారం పాఠశాలల పునర్ ప్రారంభం సందర్భంగా ఉమ్మడి మేడ్చల్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మేడ్చల్ మండల విద్యాధికారి శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం జెడ్పీహెచ్ఎస్, ఎంపీహెచ్ఎస్‌లో..

కీసర: నాగారం జెడ్పీహెచ్ఎస్, ఎంపీహెచ్ఎస్‌లో నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ మాస్టర్ రాములు విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాంపల్లి ప్రాథమిక పాఠశాలలో కీసర మండల ఎంఈఓ జమదగ్ని హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

పోచారం ప్రైమరీ స్కూల్‌లో..

పోచారం: పోచారంలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు మాజీ కౌన్సిలర్ బద్దం మమతా జగన్మోహన్‌రెడ్డి గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విదార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలన్నారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికలు, బాలుర పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరయ్యారు. హెచ్ఎం పాపిరెడ్డి, నాయకులు సంజీవ రెడ్డి, మల్లేశ్, నస్రీన్ సుల్తానా, దేవేందర్ ముదిరాజ్, ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: మేడ్చల్ హెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్, హెడ్పీహెచ్ఎస్ గూడూర్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏంఈఓ శంకరయ్య, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



నాగారం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి



ఘట్‌కేసర్‌లో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య



పోచారంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ కౌన్సిలర్ మమత జగన్మోహన్‌రెడ్డి